సాక్షి జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 17 | మే | 2025



రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు

జనగామ జిల్లా కేంద్రం బతుకమ్మకుంటలో 8వ సబ్ జూనియర్స్ స్టేట్ లెవల్ నెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభ మయ్యాయి. - IIలో▸



ఖైదీల పనితీరు ప్రోత్సహించేందుకు..

ఖైదీల పనితీరు ప్రోత్సహించడంలో భాగంగా సరస్వతీనది పుష్కరాల్లో వివిధ ఉత్పత్తులతో స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా తెలిపారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
37.4⁰ /27.9⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్టాళ్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు



కాళేశ్వరం: సరస్వతినది పుష్కరాల నేపథ్యంలో పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అందుబాటులో ఉండే సదుపాయాలను, సేవలను సమీక్షించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు విస్తృతంగా పర్యటించారు. శుక్రవారం ఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు, భక్తులకు సరఫరా చేసే తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతుందని.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్వచ్ఛత, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, డీఆర్‌డీఓ నరేష్ పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కకు ఘనస్వాగతం



భూపాలపల్లి రూరల్: సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం వెళ్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఘనస్వాగతం పలికారు. ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు దాట్ల శ్రీనివాస్, రాజేందర్, టీపీసీసీ సభ్యుడు సల్లూరి మధు, అంబాల శ్రీనివాస్, అప్పం కిషన్, ఉడుత మహేందర్ ఉన్నారు

సర్వీస్ బస్సులతో ఊరట



భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలోని తాత్కాలిక బస్టాండ్ ఆవరణ నుంచి సరస్వతి పుష్కర ఘాట్ వరకు ఏర్పాటుచేసిన ఉచిత షటిల్ బస్సు సర్వీస్‌లతో భక్తులకు ఊరట కలిగింది. ప్రత్యేక తాత్కాలిక బస్టాండ్ నుంచి సరస్వతి ఘాట్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరభారం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తుగా సింగరేణి సహకారంతో స్కూల్ బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.

రెండో రోజు అన్నదానం



భూపాలపల్లి రూరల్: సరస్వతి పుష్కరాలకు వస్తున్న భక్తుల కోసం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటుచేసిన ఉచిత అన్నదానం కార్యక్రమం రెండవరోజు భూపాలపల్లి సీఐ నరేష్‌గౌడ్‌తో కలిసి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు అశోక్, ఐత తిరుపతి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించిందన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో ఏడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అతి తక్కువ వేతనంతో పాఠశాలలను శుభ్రం చేసినా ప్రతి నెలా వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.



సరస్వతి ఘాట్‌లో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఘాట్ వద్ద భక్తుల రద్దీ..



పుష్కర స్నానం.. సకల పాప హరణం

రెండో రోజు సరస్వతి పుష్కరాలకు తరలివచ్చిన భక్తులు

- సుమారు 80వేల మంది వరకు పుణ్యస్నానాలు ఆచరణ
- కిటకిటలాడిన సరస్వతి ఘాట్, దేవస్థానం
- పుష్కర స్నానం చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వీఐపీలు

భూపాలపల్లి/కాళేశ్వరం:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతినది పుష్కరాలకు రెండో రోజు శుక్రవారం భక్తులు పోటెత్తారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతినదిలో పుష్కర స్నానాలు ఆచరించారు. నదీమాతకు పండ్లు, పూలు, పాటు, పసుపు, కుంకుమ, చీరె, సారెను సమర్పించారు. దీపాలు వదిలారు. సైకత లింగాలు చేసి ఆరాధన చేశారు. పితృతర్పనాలు, పిండప్రదానాలు చేశారు. బ్రాహ్మణ ముత్తయిదువులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. భక్తుల కష్టాలు, ఇబ్బందులు తొలగిపోవాలని కోరుతూ కాళేశ్వరాలయంలో సంకష్టహర గణపతి హోమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు రెండోరోజు హోమాలు, విశేష పూజలు చేశారు. రాత్రి కాశీపండితుల ఆధ్వర్యంలో నదికి నవరత్నమాల హారతి ఇచ్చారు.

గోదావరి, ఆలయ పరిసరాల్లో కిటకిట..

శుక్రవారం తెల్లవారుజామునుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లనుంచి తరలివచ్చిన భక్తజనంతో గోదావరి తీరం, ఆలయం కిక్కిరిసింది. ఉదయంనుంచి 10గంటలలోపు భక్తులు పలుచగా ఉండగా, మధ్యాహ్నం వరకు రద్దీ పెరిగింది.

నిండిన పార్కింగ్ స్థలాలు, చలువ పందిళ్లు..

ఆర్టీసీ బస్సులు, ట్రావెల్స్, ప్రైవేటు వాహనాల్లో భక్తులు తరలిరావడంతో పార్కింగ్ స్థలాలు కిటకిటలాడాయి. వరంగల్, భూపాలపల్లి మీదుగా తరలివస్తున్న భక్తులు, వాహనాలను వీఐపీఘాట్, ఇప్పలబోరు వైపు పార్కింగ్‌లకు పోలీసులు తరలించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మంచిర్యాల వైపునుంచి వచ్చే వాహనాలను బస్టాండ్ సమీపంలోని పార్కింగ్ స్థలం వద్ద నిలిపివేస్తున్నారు. అక్కడినుంచి ఘాట్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆర్టీసీ షెటిల్ బస్సులు ఏర్పాటు చేశారు. స్థానిక ఆటోలకు కూడా అనుమతివ్వడంతో భక్తులను పార్కింగ్ స్థలాలనుంచి సరస్వతి ఘాట్, అక్కడినుంచి ఆలయానికి తరలిస్తున్నారు. ఎండ వేడిమి అధికంగా ఉండడంతో భక్తులు చలువ పందిళ్లకింద సేదదీరడం కనిపించింది.

వీకెండ్స్‌లో పెరగనున్న భక్తుల తాకిడి..

శని, ఆదివారాల్లో భక్తుల తాకిడి రెట్టింపుస్థాయిలో ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం గోదావరి తీరం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల శుక్రవారం వచ్చిన భక్తులతోనే నిండాయి. శని, ఆదివారాల్లో లక్షమందికి పైగా భక్తులు రానున్నట్లు అంచనా. ఈ మేరకు అధికారులు మరిన్ని ఏర్పాట్లు చేస్తే ఇబ్బందులు ఉండవని, లేనిపక్షంలో ఎండకు మాడిపోవాల్సిందేనని భక్తులు అంటున్నారు.

వీఐపీల రాక..

రెండవ రోజు సరస్వతినదిలో పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా, పరకాల



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి ఇన్‌చార్జ్ జడ్జి పట్టాభిరాంలు వేర్వేరుగా పుష్కర స్నానాలు చేసి, శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు.

పుష్కరాల మరిన్ని వార్తలు, ఫొటోలు II, IIIలో..



నదిలో దీపం వదులుతున్న ఓ కుటుంబం



సరస్వతి నదిలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కుటుంబ సభ్యులు చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

పుష్కర స్నానంతో పొరపాట్లు పరిసమాప్తం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- సరస్వతి నదిలో కుటుంబసమేతంగా పుష్కరస్నానం

- వివరాలు IIలో▸

ఆర్టీసీ అత్యుత్సాహం

- కాటారంలో నిలపని ఆర్టీసీ బస్సులు
- భక్తులు, ప్రయాణికుల ఇబ్బందులు

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఐదు మండలాలకు ప్రధాన కూడలి అయిన కాటారం మండల కేంద్రంలో పలు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను ఆపకుండా డ్రైవర్లు ప్రయాణికులను, భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాళేశ్వరం పుష్కరాల కోసం కరీంనగర్ నుంచి వచ్చే భక్తులు డైరెక్ట్ బస్సులు లేకపోతే కాటారంలో బస్సు దిగి కాళేశ్వరం వైపుగా వెళ్లే బస్సు ఎక్కాల్సి వస్తుంది. కాటారం, మహాముత్తారం, మల్హర్ మండలాలకు చెందిన ప్రయాణికులు, భక్తులు సైతం కాటారం ప్రధాన కూడలిలో బస్సు ఎక్కి మహదేవపూర్, కాళేశ్వరం వెళ్లాల్సి ఉంటుంది. భూపాలపల్లి, మంథని, కరీంనగర్, వరంగల్, గోదావరిఖని డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కాటారంలో నిలపడం లేదని భక్తులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాల స్పెషల్ అని బోర్డు పెట్టుకున్న బస్సులతో పాటు సాధారణ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు సైతం స్టాప్ లేదంటున్నారని భక్తులు తెలుపుతున్నారు. దీంతో గంటల తరబడి ఎర్రటి ఎండలో రహదారిపై నిల్చొని బస్సుల కోసం చేతులు అడ్డుపెట్టాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు ప్రైవేట్ వాహనాల్లో అధిక ధర చెల్లించి వెళ్లాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. సాధారణ సమయంలో నిత్యం కాటారంలో ఆర్టీసీ బస్సులు నిలిపే అధికారులు ఇప్పుడు ఎందుకు ఆపడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. మహదేవపూర్, కాళేశ్వరం వెళ్లే ప్రయాణికులు ఎలా వెళ్తారని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ హిందును సాక్షి వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.



కాటారంలో బస్సు కోసం రోడ్డుపై ఎదురుచూస్తున్న భక్తులు, ప్రయాణికులు

మంత్రి సురేఖ వ్యాఖ్యల కలకలం!

- పైసలిస్తేనే మంత్రుల వద్ద ఫైల్స్ క్లియరవుతాయని కామెంట్
- ఇదీ కమీషన్ల సర్కార్ అని మాజీ మంత్రి కేటీఆర్ కౌంటర్
- కావాలనే తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్న మంత్రి సురేఖ
- గత బీఆర్‌ఎస్ మంత్రులనుద్దేశించి అన్నానని స్పష్టత



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారాన్ని లేపాయి. 'మంత్రుల వద్దకు క్లియరెన్స్ కోసం కొన్ని ఫైల్స్ వస్తాయి. మామూలుగా మంత్రులు డబ్బులు తీసుకొని వాటిని క్లియరెన్స్ చేస్తుంటారు. మేం మాత్రం మాకు నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం' అని ఆమె వరంగల్‌లోని కృష్ణా కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం జరిగిన నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొండా సురేఖ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆమెకు థ్యాంక్స్ అని చెప్పి, మొత్తానికి కొండా సురేఖ నిజాలు బయటపెట్టారని, కాంగ్రెస్ కమీషన్ సర్కార్ నడుపుతోందని ఎక్స్ వేదికగా పోస్టు చేయడంతో మరోసారి ఓరుగల్లు కేంద్రంగా రాష్ట్ర రాజకీయం వేడెక్కింది. 'వరంగల్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏ పనిచేయడానికి అయినా అప్పటి మంత్రులు పైసలు తీసుకునేవారని నేను మాట్లాడినా. అవి అక్షర సత్యం కూడా. ఆ మాటలకి నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నా. మా ప్రభుత్వం అద్భుతంగా పరిపాలన చేస్తుంటే ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు తమ పెయిడ్ సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేసే కుట్ర చేస్తున్నారు. అందులో భాగంగానే ఆ వీడియోలో నా వ్యాఖ్యల్ని ముందు వెనుక కొంత తీసేసి, మిగతా కొంత పార్ట్‌ను కావాలనే హైలెట్ చేయడం వెనుక ఉన్న కుట్ర ఇది' అని ఆమె మీడియాతో మాట్లాడి వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు.

గతంలోనూ పలు వివాదాలు..

- గతంలోనూ నాగచైతన్య, సమంత విడాకుల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు చేసి పరువు నష్టం దావాలు మంత్రి కొండా సురేఖ ఎదుర్కొంటున్నారు.
- గతేడాది దసరాకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో మొదలైన వివాదంలో ముగ్గురు కొండా వర్గీయులను పోలీసులు అరెస్టు చేయగా.. మంత్రి కొండా సురేఖ నేరుగా గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం అప్పుడు సంచలనంగా మారిన విషయం తెలిసిందే.
- వేములవాడ రాజన్న కోడెల విషయంలోనూ మంత్రి అనుచరుడికి అప్పనంగా కట్టబెట్టారని గీసుకొండ ఠాణాలో కేసు నమోదు కావడం కూడా గతేడాది డిసెంబర్‌లో వివాదమైంది.
- తాజాగా మంత్రులపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఏకంగా రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి.

భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు


- ఎస్పీ కిరణ్ ఖరే

కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి వస్తున్న సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కిరణ్‌ఖరే సిబ్బందికి సూచించారు. దేవాలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి శుక్రవారం ఆయన మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని, ఓపికగా విధులు నిర్వహించాలని, తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

బొగతకు జలధారలు



వాజేడు మండలపరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతానికి నీరు వచ్చి చేరింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి గుట్టలపై నుంచి వాగు పొంగడంతో జలధారలు దర్శనమిచ్చాయి. మూడుచోట్ల జలదారలు కనువిందు చేస్తున్నాయి. - వాజేడు

పుష్కరాల నిధులు ఏమయ్యాయి..?



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కాళేశ్వరం: సర్వసతి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసినప్పటికీ అభివృద్ధి పనులన్నీ అసంపూర్తిగా ఉండి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని.. అసలు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏమైయ్యాయో తెలిపాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం కాళేశ్వరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. నాలుగు రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు సామాన్య భక్తుల కోసం పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు డ్రెస్సింగ్ రూమ్స్ కూడా ఏర్పాటు చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు. వీఐపీ ఘాట్‌లో మాత్రం సౌకర్యవంతమైన డ్రెస్సింగ్ రూమ్‌లు, గుడారాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఎండాకాలం నేపథ్యంలో భక్తులు కొంతసేపు సేద దీరడానికి టెంట్లు కూడా వేయలేదని చెప్పారు. కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకే కాంట్రాక్టులు ఇచ్చి అరకొరగా పనులు చేయించారని, నిధులు ఫుల్, పనులు మాత్రం నిల్ అన్న చందంగా పుష్కరాల్లో పనులు కనిపిస్తున్నాయన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్, కాళేశ్వరం ఈఓలను కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చంద్రుపట్ల కీర్తిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, పగే రంజిత్, పూర్ణచందర్, శ్రీకాంత్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం: కాళ్వేరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. స్టాళ్లు, టెంట్‌సిటీ, సరస్వతి ఘాట్ వద్ద భక్తులను పుష్కర ఏర్పాట్లు, సౌకర్యాలు, మరుగుదొడ్లు, షవర్స్, ఘాట్స్, వైద్యశిబిరాలు, చలివేంద్రంను అధికారులతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. కాలినడకన తిరుగుతూ సౌకర్యాల ఏర్పాట్లపై భక్తులతో ఆరాతీశారు. ఈ సందర్భంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారుచేసిన హ్యాండ్ మేడ్ వస్తువుల స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. వివిధ స్టాళ్ల పరిశీలించి వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. చలివేంద్రాలలో తాగునీటి సరఫరాను పరిశీలించారు. త్రివేణి సంగమం వద్ద భక్తులకు తాగునీటి సరఫరాకు చలివేంద్రం ఏర్పాటుచేయాలని తక్షణమే వాకీటాకీ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈని ఆదేశించారు. ఈ సందర్భంగా భక్తుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ త్రివేణి సంగమంలో భక్తులు స్నానాలకు వెళ్లే మార్గంలో పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దానివల్ల భక్తులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మార్గంలో పిండప్రదానం కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. పిండ ప్రదాన నిర్వహణకు కేటాయించిన ప్రాంతంలో మాత్రమే పిండ ప్రదానాలు చేయాలని సూచించారు. వ్యర్థాలు గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలో వేయాలని, త్రివేణి సంగమంలో వేయొద్దని చెప్పారు. భక్తులు నది పవిత్రను కాపాడాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన సెల్ఫీ స్టాల్‌లో భక్తులతో కలిసి సరదాగా ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, డీఆర్‌డీఓ నరేష్, డీటీ కృష్ణ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు షురూ..

- రాత్రి 10 గంటల వరకు కొనసాగిన లీగ్ మ్యాచ్‌లు
- 25 జిల్లాల నుంచి 620 మంది క్రీడాకారుల రాక


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: జిల్లా కేంద్రం బతుకమ్మకుంటలో 8వ సబ్ జూనియర్స్ స్టేట్ లెవల్ నెట్‌బాల్ చాంపియన్ షిప్–2025 పోటీలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ రొడ్రిక్స్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యాన అండర్–16 పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు 25 జిల్లాల నుంచి 620 మంది బాలురు, బాలికల క్రీడాకారులు వచ్చారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు రెండు షిఫ్టుల వారీగా ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహిస్తున్నారు.

తొలిరోజు 45 మ్యాచ్‌లు

ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో సుమారు 45 మ్యాచ్‌లు ఆడారు. పాయింట్ల పట్టికలో ముందు వరుసలో ఉన్న టీంలు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంటాయి. అక్కడ ప్రతిభ కనబరిచిన జిల్లాలు సెమీఫైనల్, ఫైనల్‌లో తలపడనున్నాయి. నేడు(శనివారం) రాత్రి 10 గంటల వరకు సెమీఫైనల్ పోటీలను ముగించాలి.. సాధ్యం కాని పరిస్థితుల్లో 18న మిగిలిన మ్యాచ్‌లు పూర్తి చేసి సాయంత్రం ఫైనల్ పోటీలకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహద పడుతాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూనే.. ఆసక్తి ఉన్న ఆటల్లో తర్ఫీదు తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

- శివారెడ్డిపల్లి వద్ద ఘటన
- మృతుడు మాజీ మంత్రి దయాకర్‌రావు గన్‌మన్


సతీశ్ (ఫైల్)


స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండలంలోని ఛాగల్లు శివారు శివారెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్లకు చెందిన రాయరాకుల సతీశ్(42) ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై హనుమకొండ నుంచి జనగామ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఛాగల్లు శివారులో శివారెడ్డిపల్లి వద్ద జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించగా వారు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే క్రమంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

సరస్వతియే నమః
పుష్కరాలు - 2025

నదీతీరం.. భక్తజన సందోహం


పుష్కరఘాట్ వద్ద భక్తులు


ప్రమిదలను వదులుతున్న మహిళలు


పార్కింగ్ స్థలంలో వాహనాలు


వృద్ధులపై పవిత్రజలం పోస్తున్న పండితుడు


నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీపండితులు


పుష్కరాలకు వస్తున్న భక్తులు


నదిలో స్నానమాచరిస్తున్న మహిళలు, చిన్నారులు


సరస్వతీమాత విగ్రహం వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్న భక్తులు


నదిలో ప్రమిదను వదులుతున్న దంపతులు


పుష్కరాలకు వస్తున్న మహిళలు


ముక్తీశ్వరాలయంలో స్వామివారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

పుష్కర స్నానం.. మహాభాగ్యం

- పలు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులు
- సరస్వతి ఘాట్‌లో పుష్కర స్నానం
- ఆలయంలో ప్రత్యేక పూజలు


సరస్వతి ఘాట్ వద్ద పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

కాటారం: పన్నెండేళ్లకు ఒక్కసారి వచ్చే పుష్కరాలను భక్తులు మహాభాగ్యంగా భావిస్తున్నారు. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. పిల్లలు మొదలు.. పెద్దలు, వృద్ధుల వరకు త్రివేణి సంఘమంలో పరమ పవిత్ర పుష్కర స్నానం ఆచరిస్తున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. గతంలో ఇదే చోట జరిగిన గోదావరి, ప్రాణహిత పుష్కరాలకు సైతం వచ్చి పుష్కర స్నానం ఆచరించిన భక్తులు కొందరు ఉండగా.. మొదటి సారి పుష్కర స్నానం ఆచరించిన వారు సైతం ఉన్నారు. అత్యంత పవిత్రంగా భావించే పుష్కర స్నానం చేయడం అదృష్టంగా భావిస్తున్నారు. ఎన్నో జన్మల పుణ్యఫలం ఈ పుష్కర స్నానమని పలువురు పురోహితులు, పెద్దలు పేర్కొంటున్నారు. కాళేశ్వరంలో అంతర్వాహినిగా ఉన్న సరస్వతీ నది పుష్కరాలు ఈ నెల 15న ప్రారంభం కాగా 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ఇది మూడో పుష్కర స్నానం



నేను ఇప్పటి వరకు గోదావరి, ప్రాణహిత నది పుష్కరాలకు వచ్చా. ఇప్పుడు జరుగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో స్నానం ఆచరించడంతో మూడో పుష్కర స్నానం పూర్తయింది. గతంలో ఇదే కాళేశ్వరంలో జరిగిన పుష్కరాల్లో పాల్గొన్నా. ఆనందంగా ఉంది.

– లక్ష్మి, హైదరాబాద్

మొదటి సారి వచ్చా



పుష్కరాల గురించి ఇంట్లో పెద్దలు చెప్పితే విన్నా. ఇప్పుడు కల్లారా సరస్వతీనది పుష్కరాలను చూశా. నేను పుష్కర పవిత్ర స్నానం ఆచరించడం ఇది మొదటి సారి. భక్తితో కూడిన ఏదో తెలియని అనుభూతి ఏర్పడింది.

– ప్రవళిక, మహారాష్ట్ర

ఎక్కడ పుష్కరాలు జరిగినా వెళ్తా



దేశంలో ఎక్కడ పుష్కరాలు జరిగినా వెళ్తా. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ ఇలా పలు రాష్ట్రాల్లో జరిగిన గోదావరి, కృష్ణ, ప్రాణహిత, సరస్వతీనది పుష్కరాలకు వెళ్లి పదిసార్లు స్నానం చేశా. నా ఓపిక ఉన్నంత వరకు పుష్కరాలకు హాజరవుతూనే ఉంటా.

– సంతోశ్ శర్మ, వైజాగ్

పుష్కర స్నానం.. పూర్వ జన్మసుకృతం



జీవనదులకు పన్నెండేళ్లకు ఒక్కసారి వచ్చే పుష్కరాలు అత్యంత పవిత్రమైనవి. పుష్కర స్నానం ఆచరించడం పూర్వ జన్మసుకృతం. పుష్కర స్నానంతో మనసు ప్రశాంతంగా ఉండడంతోపాటు రోగపీడ నివారణ, గ్రహబలం చేకూరడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. ప్రతి ఒక్కరూ పుష్కర స్నానం ఆచరించాలి.

– రామ్‌కుమార్‌శర్మ, ద్రాక్షారామం.

పుష్కర స్నానంతో పొరపాట్లు పరిసమాప్తం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- కాళేశ్వరంలో పుష్కరస్నానం


సరస్వతీమాత విగ్రహం ఎదుట డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు గండ్ర, మక్కన్‌సింగ్

కాళేశ్వరం: పుష్కర స్నానంతో సకల సౌకర్యాలు, సౌభాగ్యాలు కలుగుతాయని, ఏవైనా పొరపాట్లు, తప్పులు జరిగి ఉంటే పరిసమాప్తమవుతాయని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సాయంత్రం కాళేశ్వరంలో కుటుంబ సమేతంగా డిప్యూటీ సీఎం పుష్కర పుణ్యస్నానం ఆచరించారు. సరస్వతిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన హారతి కార్యక్రమాన్ని వీక్షించారు. అంతకుముందు ఏకశిల సరస్వతీమాత విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ భద్రత, పారిశుద్ధ్యం, స్నానాల ఘాట్ల వద్ద అధికారులు నిబద్ధత, నిష్టతో ఏర్పాట్లు చేశారని వివరించారు. పుష్కర స్నానాలకు ప్రతీరోజు ఒక పీఠాధిపతి వచ్చి స్నానం ఆచరించి ముక్తేశ్వర దర్శనం చేసుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రాజ్‌ఠాకూర్, కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావ్ ఉన్నారు. కాగా, రాత్రి హోటల్ హరితలో బస చేశారు. శనివారం ఉదయం కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు.

వైద్య సేవలు విస్తృతం..


ఆస్పత్రిలో చేరిన వారిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ

భూపాలపల్లి అర్బన్: సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన పది వైద్య శిబిరాల్లో భక్తులకు విస్తృత వైద్య సేవలు అందిస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలో పది పడకలతో తాత్కాలిక ఆస్పత్రి ఏర్పాటు చేశారు. శుక్రవారం 200 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించగా 12 మందిని అడ్మిట్ చేసుకున్నారు. భూపాలపల్లికి చెందిన నందకిశోర్ కాళేశ్వరంలో తేలు కాటుకు గురికాగా 108లో పీహెచ్‌సీకి చేరుకోగా చికిత్స అందించారు. ఇద్దరికి ఫిట్స్ రావడంలో ప్రాథమిక చికిత్స అందించి భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పలువురు భక్తులు, పారిశుద్ధ్య కార్మికులు వడదెబ్బకు గురైనట్లు డీఎంహెచ్‌ఓ మధుసూదన్ తెలిపారు.

వీఐపీల సేవలో అధికార గణం

- సామాన్య భక్తులను పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడిన దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు


దివ్యాంగుడిని నదిలోకి ఎత్తుకుని వెళ్తున్న హనుమాన్ మాలధారులు

భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా రెండో రోజు శుక్రవారం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఈ క్రమంలో సరస్వతి ఘాట్, కాళేశ్వరాలయంలో పోలీసులు, జిల్లా అధికారులు వీఐపీల సేవలకే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. సాధారణ భక్తుల వాహనాలను పుష్కర ఘాట్‌కు కిలోమీటర్ దూరంలో గల పార్కింగ్ ప్రదేశంలో నిలిపివేస్తున్నారు. అక్కడి నుంచి నడుచుకుంటూ ఘాట్ వద్దకు వెళ్లాలి. అయితే ఇదే రహదారిపై ఒక్కో వీఐపీని రెండు, మూడు ఎస్కార్ట్ వాహనాలతో తీసుకెళ్తుండడంతో సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులను తీసుకెళ్లేందుకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా పుష్కర ఘాట్ తీరంలో తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో భక్తుల గొంతెండింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్ శర్మ మధ్యాహ్నం ట్రాలీల ద్వారా మినరల్ వాటర్ సరఫరా చేయించారు. ఆలయంలో గంటల తరబడి సామాన్య భక్తులు క్యూ లైన్లలో నిరీక్షించాల్సి వచ్చినా అధికారులు చూడలేదు. స్థానిక పోలీసు, దేవాదాయశాఖ అధికారులు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తున్న వారు... పోలీసులు, ప్రభుత్వ అధికారుల కుటుంబీకులను ప్రత్యేకంగా ఆలయం లోపలికి పంపించడంపై సాధారణ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్సవ కమిటీ ఉన్నా ఏ అధికారం లేకపోవడంతో వారు ఉత్సవ విగ్రహాలుగా మారారని పలువురు పేర్కొన్నారు.

గిరాకీ లేకపాయే..


ఖాళీగా కూర్చున్న చిలక జ్యోతిష్యుడు

మల్హర్: సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు జ్యోతిష్యం చెప్పడానికి వివిధ ప్రాంతాల నుంచి చిలక జ్యోతిష్యులు కాళేశ్వరం చేరుకున్నారు. అయితే భక్తులు జ్యోతిష్యం చెప్పించుకోవాడానికి ఆసక్తి చూపకపోవడంతో గిరాకీ లేక జ్యోతిష్యులు ఖాళీగా కుర్చుంటున్నారు.

చిల్లరకు వేట..


అయస్కాంతం పరికరంతో చిల్లర వెలికితీస్తున్న వ్యక్తి

పలిమెల: సరస్వతీనది పుష్కరాలకు భక్తుల రద్దీ పెరుగుతోంది. స్నానాలు ఆచరిస్తున్న భక్తులు గోదావరిలో చిల్లర వేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో పలువురు అయస్కాంతం పరికరాలతో నదిలో వేసిన చిల్లరను పోగు చేసుకుంటున్నారు.

కూలిన టెంట్..


ముక్తీశ్వరస్వామి దేవాలయం వద్ద కూలిన టెంట్

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టెంట్లు, చలువ పందిళ్లు కూలాయి. ముక్తీశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిర టెంట్ కూలడంతో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

లాహిరి లాహిరిలో..


పడవ ప్రయాణం చేస్తున్న భక్తులు

భూపాలపల్లి అర్బన్: సరస్వతీనది పురష్కరాల్లో భాగంగా త్రివేణి సంఘమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిస్తున్నారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం పలువురు పడవ ప్రయాణం చేసి మురిసిపోతున్నారు. పడవ ప్రయాణానికి ఒక్కరికి రూ.100 చార్జీ వసూలు చేస్తున్నారు.

ఖైదీల పనితీరు ప్రోత్సహించేందుకు స్టాల్ ఏర్పాటు

- జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా


స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు పరిశీలిస్తున్న డీజీ సౌమ్యమిశ్రా, కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం : ఖైదీల పనితీరు ప్రోత్సహించడంలో భాగంగా సరస్వతీనది పుష్కరాల్లో వారితో తయారు చేయించిన వివిధ ఉత్పత్తులతో కాళేశ్వరంలో స్టాల్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జైళ్ల శాఖ ఖైదీలకు వివిధ ఉత్పత్తి రంగాల్లో శిక్షణ కల్పిస్తూ వారితో నాణ్యమైన వస్తువులు తయారు చేయించి ఉపాధి కల్పిస్తోందన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులు ఈ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, కలెక్టర్ రాహుల్ శర్మ, వరంగల్ సెంట్రల్ జైల్ పర్యవేక్షణాధికారి టి.కళాసాగర్, ఉప పర్యవేక్షణాధికారులు పి.వెంటేశ్వరస్వామి, జైలర్ పి.పూర్ణచందర్, పరకాల సబ్ జైలు పర్యవేక్షణాధికారి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుష్కర స్నానం..




చిట్యాల/భూపాలపల్లి అర్బన్: సరస్వతీనది పుష్కరాల సందర్భంగా తమ చిన్నారులకు తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మలు పుష్కర స్నానం చేయిస్తున్నారు. అనంతరం పుణ్యం కలగాలని చిన్నారులను దీవిస్తున్నారు.

క్లుప్తంగా

చీరల పంపిణీ

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లిలో మధనపోచమ్మ తల్లీ విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన విగ్రహ, దేవాలయ నిర్మాణ దాత అంకెళ్ల వనిత –స్వామి దంపతులు దేవాలయం వద్ద పని చేసిన 14 మంది కూలీలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దంపతులకు కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ బాటిళ్లు..



ఏటూరునాగారం: శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాగబెల్లి కార్యక్రమంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు మోరంపల్లి బంజారు వాస్తవ్యులు కామిరెడ్డి రామ కొండారెడ్డి, కోటేశ్వరి దంపతులు మూడువేల వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రావణపు సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేశ్, దేవస్థానం అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.


తరుగు పేరుతో దోపిడీ

ములుగు రూరల్: తరుగు పేరుతో రైతులను రైస్ మిల్లర్లు నిలువు దోపిడి చేస్తున్నారని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. సర్వాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాపూర్ ఐకేపీ సెంటర్ 50 బస్తాల ధాన్యం మాయమైన విషయంపై అధికారులు విచారణ చేపట్టాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లిన ధాన్యం కోతలు విధిస్తున్నారని అధికారులు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం, జిల్లా సంబంధిత అధికారులు తరుగు లేకుండా ధాన్యం దిగుమతులు చేసుకుంటారని చెప్పినప్పటికీ మిల్లర్లు మాత్రం అందుకు విరుద్ధంగా రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. క్వింటాకు 5 కిలోల నుంచి పైకి కోతలు విధించడంతో రైతులు లబోదిబోమంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాజా నర్సింహులు, సాంబయ్య, లక్ష్మీనారాయణ, వీరస్వామి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కాటారం: కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్థాపంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని శంకరాంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరాంపల్లికి చెందిన గంట రవళి(22)కి ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన అన్నవేన రాజుకు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. హనుమకొండలో వారు నివాసం ఉంటుండగా భార్యభర్తల మధ్య కొన్ని రోజుల క్రితం పంచాయితీ రావడంతో రవళి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రవళి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి రాజు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కనబడటం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రవళిని కరీంనగర్‌లో గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి భార్యభర్తలకు కౌన్సిలింగ్ ఇవ్వగా భర్తతో తనకు ఉండటం ఇష్టం లేదని విడాకులు కావాలని రవళి పట్టుపట్టింది. అప్పటి నుంచి రవళి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. విడాకులు తీసుకోవద్దని భర్త వద్దకు వెళ్లాలని తల్లిదండ్రులు రవళికి నచ్చజెప్పడానికి ప్రయత్నించగా వారితో గొడవపడింది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన రవళి ఈ నెల 15 తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగింది. కాగా వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి కత్తెరసాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై గీతారాథోడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



వంశీ(ఫైల్)

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన సోమిడి వంశీ(23) విద్యుత్ షాక్‌తో భద్రాద్రి కొత్త గూడెమ జిల్లాలోని భద్రాచలంలో శుక్రవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలంలో ఒక ప్రైవేట్ వైద్యశాలలో పని చేస్తూ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఉదయం గది నుంచి కిందకు దిగడానికి ఏర్పాటు చేసిన ఇనుప మెట్ల ద్వారా దిగుతున్న సమయంలో విద్యుత్ షాక్ గురై కింద పడ్డాడు. వెంటనే వైద్యశాలకు తరలింగగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై భద్రాచలంలో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కాగా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ ఉండటంతో గురువారం రాత్రి వచ్చిన గాలి వానకు దాని ద్వారా మెట్లకు విద్యుత్ సరఫరా జరిగి ఉంటుందని భావిస్తున్నారు. సోమిడి మాణిక్యం, స్వరూప దంపతులకు ఇద్దరు కుమారులు కాగా మూడేళ్ల క్రితం పెద్ద కొడుకు నవీన్ మృతి చెందగా ప్రస్తుతం చిన్న కొడుకు వంశీ కూడా మృతి చెందాడు. కాగా స్వరుప రెండేళ్ల క్రితం మృతి చెందింది.

ఖాళీగా సూచిక బోర్డులు

- అడవిలో ఏర్పాటు చేసిన బోర్డుల్లో కనిపించని రక్షణ సూచికలు
- పట్టించుకోని అధికారులు



మల్లారం మిషన్ భగీరథ గుట్ట వద్ద ఖాళీగా ఉన్న సూచిక బోర్డు

మల్హర్: మండలంలోని కొయ్యూరు, మల్లారం మిషన్ భగీరథ గుట్ట సమీపంలో అటవీ శాఖ అధికారులు కొన్నేళ్ల క్రితం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు హెచ్చరికలు, సూచనలు కోసం అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులో ఎలాంటి సూచికలు కనబడడం లేదు. బోర్డులో ముఖ్యంగా అటవీ జంతువులు సంచరిస్తాయి. అడవి జంతువులకు హానీ చేయద్దు, అడవులను సంరక్షించాలంటూ తదితర వాటి రక్షణను సూచిస్తూ అటవీ శాఖ ఈ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ బోర్డులపై ఎలాంటి సూచికలు లేకుండా నల్ల రంగుతో దర్శనమిస్తోంది.

కొయ్యూరు రేంజర్ పరిధిలో..

మండలంలోని కొయ్యూరు రేంజ్ పరిధిలోని తాడిచర్ల, మల్లారం, కొయ్యూరు, రుద్రారం సెక్షన్లు ఉన్నాయి. ఈ సెక్షన్లలో పరిధిలోని గ్రామాలు వల్లెకుంటలో 2265.37 ఎకరాలు, ఎడ్లపల్లిలో 1234.04 ఎకరాలు, దబ్బగట్టులో 4064.22, దోమలమాదారంలో 4250.10, మోత్కుపల్లిలో 1945.11, శాత్రాజ్‌పల్లిలో 1145.10, గాంధర్లలో 3145,08, పెద్దతూండ్ల 1056.28లో, అకాన్‌పల్లి 3858.05లో, కొర్లకుంటలో 2104.24లో నాచారం (భూపాలపల్లి రేంజ్) 1298.03 ఎకరాల అటవీ భూమి ఉంది. వీటిలో దుప్పులు, చుక్క దుప్పులు, కొండ గొర్రెలు, మెకాలు, నక్కలు, గుడ్డెలుగు, అడవి కుక్కలు, అడవి పందులు తదితర అటవీ జంతువులు సంచరిస్తాయి. వీటి రక్షణకు స్పీడ్ లిమిట్, సైన్ బోర్డులు తదితర వాటిని అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు లేక పోవడంతో వాహనాల అతి వేగానికి అడవి జంతువులు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా స్పందించి సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అటవీ జంతువులను రక్షించాలి



అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు సూచిక, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలి. తాడిచర్ల నుంచి కొయ్యూరు మీదుగా నిత్యం బొగ్గు లారీలు, ఇసుక లారీల రవాణా సాగుతోంది. అటవీ జంతువుల రక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– లింగన్నపేట శివ, మల్లారం, మల్హర్

ప్రతీ పౌరుడు అభివృద్ధి పథంలో నడవాలి

- ఎంఈఓ కోడెపాక రఘుపతి



మాట్లాడుతున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: ప్రభుత్వ విద్యా సౌకర్యాలను వినియోగించుకుని ప్రతీ పౌరుడు అభివృద్ధి పథంలో నడవాలని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బాడిబాట, టీచర్–పేరేంట్స్, ఉల్లాస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరు విద్యావంతులైనప్పుడే సమాజం బాగుంటుందని అన్నారు. 15 సంవత్సరాలు పైబడిన పిల్లలు సైతం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బైరం కల్పన, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు సదయ్య, భాస్కర్, రాజమౌళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర



కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ మాలధారులు

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన హనుమాన్ భక్తులు ఈర్ల కుమార్, తుమ్మల సాగర్ టేకుమట్ల నుంచి జగిత్యాల జిల్లా కొండగట్టుకు పాదయాత్రగా శుక్రవారం బయలుదేరారు. టేకుమట్ల నుంచి వేములవాడ వరకు పాదయాత్ర చేసి అక్కడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శనం చేసుకుని అక్కడి నుంచి మళ్లీ పాదయాత్రగా కొంగట్టుకు చేరుకుంటామని తెలిపారు. ఈ నెల 22న హనుమాన్ జయంతి రోజున మాల విరమణ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

డెంగీ నిర్మూలనకు కలిసి నడుద్దాం..



ర్యాలీ తీస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

- వైద్యాధికారి మధుకర్

వాజేడు: డెంగీ నిర్మూలనకు అందరం కలిసి నడుద్దామని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వాజేడు, పేరూరు వైద్యశాలల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ.. డెంగీ జ్వరాలను రానివ్వకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధను చూపించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. దోమ తెరలను విధిగా వాడాలని సూచించారు. ఈ ర్యాలీలో వేణుగోపాల కృష్ణ, కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, ఆశకార్యకర్తలు ఉన్నారు.

గ్రామకమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీతో నాయకులు

రేగొండ: మండలంలోని పోచంపల్లి గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జ్ బండారి దేవేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కట్ల నర్సింహారెడ్డి, ప్రధానకార్యదర్శిగా రాసమల్ల వెంకట్, కేతిరి రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇండ్ల మొగిలి, మార్క నరేష్, కోశాధికారిగా కట్ల అన్నారెడ్డి, యూత్ అధ్యక్షుడిగా కడారి అమరేందర్ ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మైస భిక్షపతి, ముద్దమల్ల రవి, ఇండ్ల రవి, రాస ప్రశాంత్, మల్లారెడ్డి, తిరుపతి, రాజు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్



విరిగిపోయిన విద్యుత్ పోల్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలను ఇసుక టిప్పర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పగూడెం గ్రామ సమీపంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్ విద్యుత్ ప్రధాన లైన్ విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టడంతో విద్యుత్ పోల్ విరిగి పోయిందని, మరో విద్యుత్ పోల్ పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు విద్యుత్ శాఖ సిబ్బందితో సంఘటన ప్రాంతానికి వెళ్లి విద్యుత్ లైన్‌ను, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం కలుగకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల లైన్ నుంచి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించి ప్రజలకు విద్యుత్ అంతరాయం కుగకుండా చర్యలు చేపటినట్లు విద్యుత్ శాఖ ఏడీఏ అకిటి స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ హనుమాన్ దాస్, విద్యుత్ సిబ్బంది ఫరీద్ తదితరులు ఉన్నారు.

పెసా గ్రామసభను రద్దు చేయాలి

మంగపేట: మండలంలోని గొల్లగూడెం ఇసుక క్వారీ నిర్వహణ కోసం రమణక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో గురువారం నిర్వహించిన పెసా గ్రామ సభను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రాజుపేటకు చెందిన గిరిజనులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొల్లగూడెం ఇసుక క్వారీ నిర్వహణ కోసం రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలో పెసా గ్రామ సభ నిర్వహించాల్సి ఉండగా రమణక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో గురువారం నిర్వహించారన్నారు. సమాచారం తెలియడంతో తాము అక్కడికి వెళ్లి గొల్లగూడెం ఇసుక క్వారీ నిర్వహణ కోసం రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలో పెసా గ్రామ సభ నిర్వహించాల్సి ఉండగా రమణక్కపేటలో ఎలా నిర్వహిస్తారని, ఎంపీడీఓను, ఇతర అధికారులను అడిగినట్లు తెలిపారు. దీంతో వారు పెసా గ్రామ సభను వాయిదా వేస్తున్నామని తమకు హామీ ఇవ్వడంతో తాము అక్కడ నుండి వెళ్లి పోయామన్నారు. కాని తాము వెళ్లక తిరిగి గ్రామ సభ నిర్వహించారని ఈ విషయంపై ఎంపీడీఓను అడగడానికి కార్యాలయానికి రాగా ఎంపీడీఓ అందుబాటులో లేరని అన్నారు. రమణక్కపేటలో నిర్వహించిన పెసా గ్రామ సభను రద్దు చేసి రాజుపేట పరిధిలో తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వారాంతపు సంత ప్రారంభం

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తిలో శుక్రవారం వారాంతపు సంత ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సంతను ప్రారంభించారు. సంతలో 33మంది వ్యాపారాస్థులు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకుని కూరగాయలు, నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచారు. చుట్టుపక్కల గ్రామాలైన సూరంపేట, నర్సింహులపల్లి, పులుకుర్తి, పోచారం గ్రామాల ప్రజలు వారికి కావాల్సిన సరుకులను కొనుగోలు చేసుకున్నారు.



గాలి దుమారానికి కూలిన టెంట్లు, స్వాగత ద్వారాలు

మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శుక్రవారం అర్ధరాత్రి గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. కాగా గాలిదుమారానికి పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన టెంట్లు, స్వాగత ద్వారాలు కూలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. – కాళేశ్వరం

మద్యం తాగి వాహనాలను నడపొద్దు



బ్రీత్ ఎనలైజర్ మిషన్ ద్వారా పరీక్షిస్తున్న ఎస్సై

ఎస్ఎస్‌తాడ్వాయి: మద్యం తాగి వాహనాలను నడపొద్దని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాటాపూర్ క్రాస్ వద్ద డ్రంకన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. వాహనదారులు సంబంధిత పత్రాలను కలిగి ఉండాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇక్కడ వెలవెల.. అక్కడ కళకళ



గోదావరి ఘాట్ వద్ద వెలవెల బోతున్న షాపులు



సరస్వతి ఘాట్ వద్ద కళకళలాడుతున్న షాపులు

సరస్వతియే నమః పుష్కరాలు – 2025

మల్హర్: సరస్వతి పుష్కరాల్లో ప్రధాన గోదావరి ఘాట్‌కు రహదారిని వీవీఐ వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతినిస్తున్నారు. సాధారణ భక్తులకు, ఇతర వాహనాలకు రహదారిని అనమతిని నిరాకరిస్తున్నారు. దీంతో ఈ దారికి ప్రజలకు రాకపోకలు లేక గోదావరి ప్రధాన ఘాట్ గుండా ఉన్న కిరణా షాపులు, కొబ్బరి కాయలు, టీఫిన్ సెంటర్ తదితర షాపులకు గిరాకీలు లేక వెలవెల బోతున్నాయి. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సరస్వతి ఘాట్ వద్ద భక్తుల తాకిడితో ఈ ప్రాతంలోని షాపులు కళకళాడుతున్నాయి. గోదావరి ప్రధాన ఘాట్ వద్ద భక్తుల రద్దీ లేక షాపుల్లో గిరాకి కాకపోవడంతో షాపు యజామానులు ఆందోళన చెందుతున్నారు.

పాదరక్షలకు చోటేది!



కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో సరైన ఏర్పాట్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన ఆలయం ఆవరణలో చెప్పుల స్టాండ్‌లు లేక భక్తులు తమ పాదరక్షలను ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. ఆలయ రెండో ద్వారం వద్ద గల శివుడి ప్రతిమ ముందు భక్తులు తమ చెప్పులను విచ్చలవిడిగా విడిశారు. ఆలయం ముందు ఎటు చూసిన చెప్పులే దర్శనమిచ్చాయి. పవిత్ర పుణ్యక్షేత్రంలో పాదరక్షలు పెట్టుకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఎదుట చెప్పులు వదలడం అపచారం అయినప్పటికి తప్పదని పలువురు భక్తులు చెప్పుకొస్తూ అధికారులపై ఆగ్రహం తెలుపుతున్నారు.

కడుపు నింపి.. నీడ నిచ్చి



కాటారం: సరస్వతి పుష్కరాల్లో భిక్షాటకులు, గంగిరెద్దుల ఆటగాళ్లు, పలువురు వారికి తెలిసిన విద్యను ప్రదర్శిస్తూ నాలుగు రూపాయలు పోగు చేసుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లా రంగంపేటకు చెందిన సారయ్య సరస్వతి పుష్కరఘాట్ వద్ద గంగిరెద్దును ఆడిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పుష్కరఘాట్‌లో గంగిరెద్దు నీడన కూర్చొని భక్తుల వద్ద చేయిచాస్తున్నాడు. ఉపాధి కోసం తన వెంట తెచ్చుకున్న గంగిరెద్దు సారయ్యకు ఓ పక్క కడుపు నింపుతూ మరో పక్క ఎండదెబ్బకు గురికాకుండా నీడ నిస్తుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

ప్లాస్టిక్‌పై నియంత్రణ ఏది?



పలిమెల: సరస్వతి నదీ పుష్కరాల్లో ప్లాస్టిక్ నియంత్రణ కరువైంది. పలువురు హోటళ్లు, సత్రాల నిర్వాహకులు వాడుకున్న వ్యర్థాలను, మిగిలిన ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో వేసీ రోడ్లపై పడేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ కవర్లలోని ఆహారంతోపాటు, కవర్లను సైతం మూగజీవాలు తినడంతో రోగాల భారిన పడి మృతిచెందే ప్రమాదం నెలకొంది. కాగా అధికారులు ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టిసారించి, రోడ్లపై కవర్లను, ప్లాస్టిక్ కవర్లు నిలువకుండా చర్యలు తీసుకోవాలని పశు ప్రేమికులు కోరుతున్నారు.

సెల్ఫీ సందడి..





భూపాలపల్లి అర్బన్: సరస్వతీనది పుష్కరాల్లో భక్తులు సందడి చేస్తున్నారు. ఒక పక్క కుటుంబ సభ్యులతో కలిసి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూనే మరోపక్క సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

ఆయుష్మాన్‌భవ..



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఆర్‌డీడీ ప్రమీల

కాళేశ్వరం : సరస్వతీనది పుష్కరాల్లో ఉచిత ఆయుష్ సేవలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఆర్‌డీడీ ప్రమీల, భూపాలపల్లి నోడల్ ఆఫీసర్ తనుజారాణి తెలిపారు. భక్తులు ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు చంద్ర, భానుకుమార్, షగుప్తా, జ్యోత్స్న, సారంగపాణి, ఫార్మసిస్టులు శైల జ, సునీత, రీటా సునీత, యోగా ఇన్‌స్ట్రక్టర్లు రాము, శ్రీధర్, ఎస్ఎన్‌ఓలు సుమన్, ఫరీదా పాల్గొన్నారు.

భానుడికి గొడుగుతో చెక్..



పలిమెల : సరస్వతీ నదీ పుష్కరాలకు తరలి వస్తున్న భక్తులు ఎండవేడితో సతమతమవుతున్నారు. దీంతో పలువురు భక్తులు ఎండ వేడికి గొడుగులతో రక్షణ పొందుతున్నారు.

సాధువులపై చీత్కారాలు ఎందుకు?

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతినది పుష్కరాల్లో సాధువులు అని కూడా చూడకుండా చీత్కారాలు చేస్తున్నారని ఇద్దరు సాధువులు సోషల్‌మీడియాలో పోస్టు వైరల్ చేశారు. శుక్రవారం కాళేశ్వరం పుష్కర స్నానాలు వస్తున్న క్రమంలో వాహన రుసుం రూ.100, కాళేశ్వరాలయంలో రూ.100 దర్శనానికి టిక్కెట్లు, ఇతర చోట్ల కూడా అధికంగా డబ్బులు దండుకుంటున్నారని పోస్టు చేసి మాట్లాడారు. సాధువులపై ఎందుకు ఇంత దౌర్జన్యం అవసరమా అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించాలని వేడుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



టీమోపాస్ మందు చల్లుతున్న సిబ్బంది



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

వాజేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పల్లె దావఖాన వైద్యాధికారిని గ్నానస అన్నారు. మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం, ప్రగళ్లపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిలువ ఉన్న నీటిని పారబోయాలని తెలుపడంతో పాటు మురుగు నీటి కాల్వల్లో టీమోపాస్ మందును చల్లారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కోటిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ
వరంగల్
శనివారం ॥ 17-5-2025





హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్త్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

''అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

> అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

అడెలా స్త్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్



● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలి సారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రెనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షనల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.




● అజయ్, రోషిణి

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే. ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే... అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే! పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో... ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్. అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు... విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది. అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

సగ్గుబియ్యం అప్పడాలు



కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్ల పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది.. మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

''లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరపు, అమ్మ తరపు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.